

కిడ్నీ వ్యాధి కాటేస్తోంది!

● మళ్లీ ప్రబలుతున్న మహమ్మారి ● ఓ గ్రామంలో 80 మందిలో ప్రాథమిక లక్షణాలు గుర్తింపు ● గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే కారణం
● 'సుజలధార' ప్లాంట్ల మూసివేతతో శుద్ధజలం కరువు
● తాగునీటి కోసం బావులు, బోర్లుపై ఆధారపడుతున్న ఉద్దానం వాసులు
● మేల్కోకుంటే ముప్పు తప్పదంటున్న వైద్యులు



వజ్రపుకొత్తూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మళ్లీ కోరలు చాస్తోంది. తీరప్రాంత గ్రామాల్లో ఈ వ్యాధి మళ్లీ ప్రబలుతోంది. అధిక జనాభా ఉన్న ఓ గ్రామంలో ఇటీవల ఓ ప్రైవేటు ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించగా 80 మందిలో కిడ్నీ వ్యాధి ప్రాథమిక లక్షణాలు బయటపడ్డాయి. దీంతో తీవ్ర కలకలం రేగింది. ఒక్క గ్రామంలోనే ఇంత మంది బాధితులు ఉంటే, మిగిలిన తీర ప్రాంత గ్రామాల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్దానం వాసులకు శుద్ధజలాలను అందించే ఎన్టీఆర్ సుజలధార ప్లాంట్లను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. దీంతో ప్రజలు తాగునీటి కోసం బావులు, బోర్లపై ఆధారపడుతున్నారు. ఈ నీరువల్లే కిడ్నీ వ్యాధి మళ్లీ ప్రబలిందని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు అప్రమత్తం కాకుంటే ముప్పు తప్పదని, మరింతమంది ఈ వ్యాధి బారిన పడే అవకాశాలు లేకపోలేదని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.

కారణాలు ఏంటో?

ఉద్దానంలో కిడ్నీ వ్యాధి ప్రబలడానికి కారణాలు ఏంటో అంతుచిక్కడం లేదు. దీనిపై గత 30 ఏళ్లుగా వివిధ పరశోధనలు జరుగుతున్నప్పటికీ కచ్చితమైన కారణాలు మాత్రం తెలియడం లేదు. అయితే నీటిని శుద్ధి చేసి ఉపయోగించడం వలన కొంతమేర కిడ్నీ వ్యాధిని నివారించవచ్చునని వైద్యులు సూచించారు. ఈ మేరకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఎన్టీఆర్ సుజలధార పథకం పేరిట గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేసింది. 20 లీటర్ల నీటిని కేవలం రూ.2కే అందించింది. దీంతో ఉద్దానం ప్రజలు ఈ నీటిని ఉపయోగించడం వలన కొంతమేర కిడ్నీ వ్యాధి తగ్గుముఖం పట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సుజలధార పథకం నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో పలు గ్రామాల్లో (మిగతా 4వ పేజీలో..)

కిడ్నీ పరీక్షలు నిరంతరం చేయాలి



కిడ్నీ వ్యాధి పరీక్షలను నిరంతరం చేయాలి. దీనివల్ల ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి నివారించవచ్చును. చాలా గ్రామాల్లో డయాలసిస్ పేషెంట్లు ఉన్నారు. వారిని చూస్తుంటే మిగిలిన వారిలో కూడా వ్యాధిపై ఆందోళన వ్యక్తమవుతుం ది. వైద్యసిబ్బంది స్పందించి గ్రామాల్లో అందరికీ వైద్య పరీక్షలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

-పోతనపల్లి సాంబమూర్తి, మాజీ సర్పంచ్, రాజాం పంచాయతీ, వజ్రపుకొత్తూరు

బయటకు చెప్పడం లేదు



చాలామందిలో కిడ్నీ వ్యాధి లక్షణాలు ఉన్నా వారు బయటకు చెప్పడం లేదు. దాన్ని నామోషీగా భావిస్తున్నారు. దీంతో వ్యాధి ముదిరి తీవ్ర రూపం దాల్చిన తరువాత వైద్యులు సహితం ఏమిచేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. కిడ్నీ వ్యాధి, దాని లక్షణాలు, వాడాల్సిన మందులు, నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలి.

-బి.శివ, బైపల్లి, వజ్రపుకొత్తూరు

జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చు



కిడ్నీ వ్యాధి బాధితులు తగు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని నివారించవచ్చు. అన్ని పీహెచ్‌సీల్లో కిడ్నీ వ్యాధి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. 35 ఏళ్ల దాటిన వారు ఆరునెలలకు ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయించు కోవడం మంచిది. వ్యాయామంతో పాటు పరిశుభ్రమైన నీటిని తగినంత తాగాలి.

-విజయకుమార్ రెడ్డి, అక్కుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు

ఐదేళ్ల తరువాత..

● అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త పుస్తకాలు
● బోధనకు తొలగిన అడ్డంకులు



హిరమండలం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన కొత్త పుస్తకాలు

హిరమండలం, డిసెంబరు 30: (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. సౌకర్యాలు దేవుడెరుగు కనీసం చిన్నారులకు అవసరమైన పుస్తకాలు, పలకలను కూడా పంపిణీ చేయలేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలు, పలకలతోనే ఐదేళ్లు నెట్టుకొచ్చారు. వాటితో పిల్లలకు బోధించేందుకు ఇబ్బందుల పడేవారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి ఇబ్బందులు తొలగాయి. ఐదేళ్ల తరువాత అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త పుస్తకాలు వచ్చాయి. ఫలితంగా చిన్నారుల బోధనకు అడ్డంకులు తొలగాయి.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 16 ప్రాజెక్టుల పరిధిలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రసుత్తం పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నారు. మూడేళ్లలోపు చిన్నారులను ప్రీ ప్రైమరీ-1, మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను పీపీ-2గా విభజించి పాఠాలు బోధిస్తున్నారు. గతంలో పీపీ-2 విద్యార్థులకు ఒక్కొక్కరికి నాలుగు పుస్తకాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఐదు చొప్పున అందిస్తున్నారు. వీటిలో తెలుగు అక్షరాలతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఆంగ్ల అక్షరాలు, బొమ్మలు గీయడం, ఆటపాటలతో పద్యాలు, ఆకట్టుకునే బొమ్మలు వంటి పుస్తకాలు ఉన్నాయి.

సృజనాత్మకతను వెలికితీసేలా..

గత వైసీపీ ప్రభుత్వం పూర్వ ప్రాథమిక (మిగతా 4వ పేజీలో..)

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ఎచ్చెర్ల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టే బుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ఎస్పీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంటు (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్సీ (పీఈటీ) పరీక్షలు నిర్వహిస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన, బయోమెట్రిక్ అథంటికేషన్ తీసుకుంటున్నారు. అలాగే ఫిజికల్ మెజర్‌మెంట్‌కు సంబంధించి ఛాతి, ఎత్తు కొలతలు నిర్వహించారు. ఫిజికల్ ఎఫిషియన్సీలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ నిర్వహించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి అంశాన్ని సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు. నీరు, వైద్య శిబిరాన్ని అందుబాటులో ఉంచారు. ఎక్కడ ఎలాంటి లోపాలు లేకుండా, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసుకుని, ఈవెంట్‌లో ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించాలని అభ్యర్థులకు ఎస్పీ సూచించారు. మొదటి రోజు 600 మంది అభ్యర్థులకు గాను 322మంది హాజరయ్యారు. వీరిలో 192 మంది ఎంపికయ్యారు.



అభ్యర్థి ఛాతీ కొలతలు తీస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

● ఆరు జిల్లాల్లో 21,555 మంది ఓటర్లు



4లో

సిక్కోలుతో కొత్త సీఎస్‌కు అనుబంధం

● రెండు దశాబ్దాల కిందట జిల్లా కలెక్టర్‌గా పని చేసిన విజయానంద్ 4లో

రండి బాబూ రండి

● జోరందుకున్న పండగల వ్యాపారం
● మార్కెట్‌లో డిస్కౌంట్ల సందడి
● కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్న వ్యాపారులు
● నాణ్యతను చూడాలంటున్న నిపుణులు

4లో



- జోరందుకున్న పండగల వ్యాపారం
- మార్కెట్‌లో డిస్కౌంట్ల సందడి
- కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్న వ్యాపారులు
- నాణ్యతను చూడాలంటున్న నిపుణులు



రండి బాబూ రండి



కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న నగరంలోని షాపింగ్ మాల్స్

ఒకటి కొంటే మరొకటి ఫ్రీ. రెండు కొంటే మూడోది ఉచితం. పండుగ క్లియరెన్స్ సేల్.. భారీ ఆఫర్లు.. కళ్లు చెదిరే రాయితీలు..... జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఇవే ప్రకటనలు కనిపిస్తున్నాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ఇదే ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. ఇవి సాధారణ, మధ్య తరగతి వారితో పాటు ఉన్నత వర్గాలనూ ఆకర్షిస్తున్నాయి. ఆఫర్ల గురించి ఆలోచించేలా చేస్తున్నాయి. ఎక్కడ తమకు అనుకూలంగా ఉంటున్నాయో నిర్ణయించుకునే వెసులుబాటును కల్పిస్తున్నాయి. అదే సమయంలో ఆఫర్‌లో లభిస్తున్న వాటి నాణ్యత పైనా దృష్టి పెట్టాలని నిపుణులు చెబుతున్నారు.

శ్రీకాకుళం/ నరసన్నపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండగ సందడి ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రం శ్రీకాకుళంతో పాటు ఇతర పట్టణాల్లోనూ బంగారు, వస్త్ర దుకాణాలు, గృహోపకరణాలు, వాహనాల షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ గత వారం రోజులుగా కొనుగోలుదారులతో కిటికిటలాడుతున్నాయి. కొందరు వ్యాపారులు బంఫర్ ఆఫర్లు ప్రకటించగా ..మరికొందరు వ్యాపారులు గిఫ్ట్ కూపన్లు... స్క్రాచ్ కార్డులు... ఒకటి కొంటే మరొకటి ఉచితం... కిలోల్లో వస్త్రాలు తదితర ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు లక్కీడిప్‌లు. రూ.వెయ్యి..రూ. పదివేలు... రూ.50 వేల వరకు ఖరీదు చేస్తే.. అదనపు డిస్కౌంట్లు అంటూ ప్రకటనలు ఇస్తున్నారు. రెండు ప్యాంట్లు రూ.వెయ్యి... ఒక ప్యాంట్ రూ.750 అని.. రూ. 2వేల చీర రూ.వెయ్యికే సొంతం చేసుకోవాలని ఊరిస్తున్నారు. వినియోగదారులను విభిన్న రీతుల్లో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. లక్కీడిప్‌ల ద్వారా బైకులు, కార్లను బహుమతులుగా ఇస్తామని ప్రకటిస్తూ..ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

సిక్కోలు కిటకిట

శ్రీకాకుళం నగరంలో షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు అధికంగా ఉండే జీటీ రోడ్డు, సూర్యమహల్ జంక్షన్, పాలకొండ రోడ్డు తదితర ప్రాంతాలు సందడిగా మారిపోయాయి. సంక్రాంతి దుస్తుల కొనుగోలు కోసం ఇతర ప్రాంతాల నుంచి నగరానికి పెద్ద సంఖ్యలో వస్తున్నారు. సరిహద్దులోని ఒడిశా నుంచి కూడా ఇక్కడికే వచ్చి షాపింగ్ చేసుకుంటున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే వ్యాపారం నాలుగు నుంచి ఐదురెట్లు అధికంగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.వెయ్యి కోట్లకు పైగా వ్యాపారం జరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వస్తువుల వ్యాపారం అదనం.



అసలు స్టిక్కర్లు ఉండవు

వస్త్ర దుకాణాల్లో ఉత్పత్తి చేసిన కంపెనీలకు సంబంధించిన ఎంఆర్‌పీ స్టిక్కర్లు మాత్రమే ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ వాటిని తీసివేసి.. సొంత ఎంఆర్‌పీ స్టిక్కర్లను పెడుతున్నారు. ఇది నేరం కూడా. కొన్ని చోట్ల కిలోల వంతున దుస్తులు అమ్ముతున్నారు. అసలు దుస్తుల నాణ్యత ఎంత? దానికి దుకాణ యజమాని ఎంత రేటు కట్టి విక్రయిస్తున్నారు? తూకం సరిగా ఉందా లేదా? అన్న విషయంపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టడం లేదు.



సంక్రాంతి జోష్..

క్రిస్మస్ సందర్భంగా దాదాపుగా డిసెంబరు మొదటి వారం నుంచే కొనుగోళ్లు మొదలయ్యాయి. సంక్రాంతికి వస్తు, వస్త్ర విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు ఏం చేయాలా అని ఇతరుల కంటే భిన్నంగా ఆఫర్లు ప్రకటించేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సీజన్‌లో వస్త్ర వ్యాపారానిదే అగ్రస్థానం. శ్రీకాకుళం నగరంలో చిన్న, పెద్ద వస్త్ర దుకాణాలు సుమారు 100 వరకు ఉంటాయి. 300కు పైగా బంగారం షాపులు ఉన్నాయి. ప్రముఖ కార్పొరేట్ సంస్థలకు చెందిన మాల్స్ ఉన్నాయి. వీటితో పాటు నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో వస్త్ర, బంగారు దుకాణాలు ఉన్నాయి. పండగ వస్తుందంటే వీటన్నింటికీ డిమాండ్ ఎక్కువే. దీంతో వ్యాపారులు భారీ ఆఫర్లు పెట్టి క్యాష్ చేసుకుంటున్నారు.



లక్కీ డ్రాకు సిద్ధం చేసిన బైక్,ఫ్రిజ్ తదితర వస్తువులు

ఆఫర్ మంచిదే కానీ..

వస్త్రాలు, గృహోపకరణాలు, ఇతర వస్తువులను పండగ సమయాల్లో తక్కువ ధరలు, ఆఫర్లతో విక్రయిస్తుంటారు. ఇవి సామాన్యులకు కొంత ఊరటనిచ్చేవేననడంలో సందేహం లేదు. అదే సమయంలో వీటి వెనుక చిన్నపాటి మాయాజాలమూ ఉంటోంది. ఆఫర్ల పేరుతో కొన్ని షాపుల యజమానులు నాసిరకం వస్త్రాలు, వస్తువులు అంటగడుతుంటారు. కొందరు చాలా కాలంగా షాపుల్లో ఎవరూ కొనుగోలు చేయకుండా వదిలేసిన వాటిని, కాలం చెల్లిన వాటిని విక్రయిస్తున్నారు. దీనిని గుర్తించలేని వినియోగదారులు మోసపోతున్నారు. ఆఫర్‌తో పాటు నాణ్యత కూడా అత్యవసరమని గుర్తించాలి. ఆఫర్‌పై ఆశతో నాణ్యత లేని వస్త్రాలు, వస్తువులు కొనుగోలు చేసి..ఇబ్బంది పడడకం కంటే...కాస్త భారమైనా అసలు ధర పెట్టి కొనుగోలు చేయడమే మేలన్న సంగతి గుర్తెరగాలి. వాస్తవానికి ఎమ్మార్పీ ధర రూ.2 వేలుగా చూపించి... దానిని రూ.వెయ్యికే విక్రయిస్తారు. దాని అసలు ధర రూ.వెయ్యి దాటి ఉండదనే విషయం తెలుసుకోవాలి. వ్యాపారి ఎవరైనా లాభం చూసుకునే రాయితీలు ప్రకటిస్తారు. సాధారణంగా రూ.100 లాభం వచ్చేచోట రూ.80 వచ్చేలా ఆఫర్ ఇస్తుంటామని, దీని వల్ల ఎక్కువ మొత్తంలో కొనుగోలు జరుగుతుందని..తద్వారా ఆదాయం వస్తుందని ఓ వ్యాపారి చెప్పారు.

- ఇటు అధ్యాపకుడిగా.. అటు కళాకారుడిగా రాణింపు
- శరత్‌బాబుకు ప్రశంసల వెల్లువ

మాస్టార్

హరిపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వృత్తి రీత్యా జంతు శాస్త్ర అధ్యాపకుడు. కానీ అతడిలో కళాతృష్ణ, సేవాభావం అధికం. ఒక్కపక్క విద్యా బోధన కొనసాగిస్తునే మరో పక్క వివిధ రకాల సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. కళారంగంలో తనకున్న మక్కువతో వివిధ రకాల వేషాలతో నాటకాలు, ఏకపాత్రాభినయాలను ప్రదర్శిస్తున్నారు. పలువురి గాత్రాన్ని అనుకరిస్తూ ఔరా అనిపిస్తున్నారు మందస మండలం కుంటికోట గ్రామానికి చెందిన జూనియర్ కళాశాల అధ్యాపకుడు చింతాడ శరత్‌బాబు. విద్యార్థి దశ నుంచే కళలపై మక్కువ పెంచుకుని వివిధ వేషధారణలతో అందరినీ ఆయన మెప్పిస్తున్నారు.



భక్త రామదాసుగా..

కరగని కళాతృష్ణ..

మందస మండలం కుంటికోట గ్రామానికి చెందిన అధ్యాపకుడు చింతాడ సారథి, సుశీలల ఏకైక కుమారుడు శరత్‌బాబు. తనలోని కళలపై చిన్నతనం నుంచే దృష్టి పెట్టి సాధన చేశాడు. డిగ్రీ చదువుతున్న సమయంలోనే కళలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవారు. దీంతో ఆంధ్రా వర్సిటీలో స్నాతకోత్సవాలు, భీమవరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆయన చంద్రబాబు పాత్రధారణతో అందరినీ అబ్బురపరిచారు. అప్పటి కలెక్టర్ వసుధ మిశ్రా చేతుల మీదుగా ప్రత్యేక బహుమతి పొందడంతో పాటు ప్రముఖుల ప్రశంసలు పొందారు. సాంఘిక, పౌరాణిక నాటకాలు, ఏకపాత్రాభినయాల్లో అలూరి సీతారామ రాజు, భక్తరామదాసు, శ్రీరాముడు, అర్జునుడు, లక్ష్మణుడి పాత్రల్లో ఒదిగిపోయేవారు. రాజకీయ ప్రముఖులు సీఎం చంద్రబాబునాయుడు, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, జగన్, రోశయ్య, హనుమంతరావు.. సినీ హీరోలు చిరంజీవి, బాలకృష్ణ, కృష్ణ, పవన్ కల్యాణ్, ఎమ్మెస్ నారాయణ, బ్రహ్మానందం వంటి పలువురి గాత్రాన్ని అనుకరించి... అందరినీ అలరిస్తుంటారు.


ప్రశంసలు.. అవార్డులు..

- కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోగా, లైబ్రేరియన్‌గా, ఏజీఎంసీ చైర్మన్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తూ, జిల్లా అధ్యాపకుల సంఘం ఉపాధ్యక్షుడిగా సేవలను అందిస్తున్నారు.
- ఎన్‌ఎస్‌ఎస్ పీవోగా 2015లో అనంతర పురంలో జరిగిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో జిల్లా తరఫున పాల్గొన్నారు. అక్కడ ప్రదర్శించిన పలు కార్యక్రమాలకు ఉత్తమ బహుమతులు అందుకున్నారు.
- కళాశాలలో వరుసగా 6 ఏళ్ల జంతుశాస్త్ర విభాగంలో 100 శాతం ఫలితాలు సాధించి అప్పటి ఆర్‌జేడీ తిరుమలాచార్యులు నుంచి ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.
- ఏటా కళాశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అవార్డులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్నారు.
- మిమిక్రీ, చంద్రబాబు పాత్రధారిగా టీవీ ప్రదర్శనను ఇచ్చి సీఎం చంద్రబాబు నుంచి ప్రత్యేక అభినందనలు పొందారు.

అందరికీ ఉపయోగపడేలా..

ప్రతి పని అందరికీ ఉపయోగపడేలా చేయాలని, అందుకు తగ్గట్టు కృషి చేస్తున్నాను. కళలపై విద్యార్థులకు ఉన్న శ్రద్ధను గమనించి బోధనలో దానిని వినియోగించి విద్యార్థులకు ఉపయోగపడేలా బోధన సాగిస్తున్నాను. చిన్నతనం నుంచి మిమిక్రీ పట్ల ఉన్న ఆసక్తి నాకు ప్రవృత్తిగా మారింది. విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే ప్రతి పని నిబద్ధతలో కొనసాగిస్తా.

-చింతాడ శరత్‌బాబు, అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మందస



సీఎం చంద్రబాబునాయుడు వేషధారణలో శరత్



రహదారి మధ్యలో ఇరుక్కున్న లారీలు

తప్పుకోలేక..

- రహదారిపై ఇరుక్కున్న లారీలు
- గంటకు పైగా ట్రాఫిక్ జాం

బూర్జ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కొల్లివలస-నారాయణపురం రహదారిలో సోమవారం గంటకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌కు లారీలు, ట్రాక్టర్లు నిత్యం ఈ రహదారిలో ప్రయాణం సాగిస్తుంటాయి. వీటితో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో ఈ రహదారి గుండానే ఇసుకను తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఈ రోడ్డుపై ఒక వైపు నుంచి ఒకేసారి వచ్చిన వాహనాలు తప్పుకోవడానికి మార్గంలేక ఇరుక్కున్నాయి. దీంతో రెండువైపులా దాదాపు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఇక్కడ తరచూ ఇదే తరహా సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి...అటు రహదారికి మరమ్మతులు చేయడంతో పాటు వాహనాల రాకపోకలను, ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

కిడ్నీ వ్యాధి కాటేస్తోంది!

(మూడో పేజీ తరువాయి)

ప్లాంట్లు మూతపడ్డాయి. కొన్నిచోట్ల ప్లాంట్లు ఉన్నా 20 లీటర్ల నీటిని రూ.7కు విక్రయిస్తుండడంతో ప్రజలు సుజలధార నీటికి దూరమయ్యారు. తాగునీటి కోసం మళ్లీ పాత పద్ధతిలోనే బావులు, బోర్లపై ఆధారపడ్డారు. దీనివల్లే కిడ్నీ వ్యాధి మళ్లీ ప్రబలిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలాఉండగా, పీహెచ్‌సీల్లో కిడ్నీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్న విషయం చాలామందికి తెలియదు. దీనిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా చాలామందిలో వ్యాధి లక్షణాలు ఉన్నా, పరీక్షలు చేయకపోవడం వల్ల వారికి ఆ వ్యాధి గురించి తెలియడం లేదు. ఈ క్రమంలో ఇటీవల ఓ ప్రైవేటు ఆసుపత్రి ఓ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కిడ్నీ పరీక్షలు కూడా చేశారు. దీంతో 80 మందిలో కిడ్నీ వ్యాధి ప్రాథమిక లక్షణాలు బయటపడ్డాయి. వైద్యులు వారికి తగిన సూచనలు అందించారు. ఈ నేపథ్యంలో మిగిలిన గ్రామాల్లో కూడా ఇదే విధమైన పరీక్షలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతే కాకుండా కూటమి ప్రభుత్వం స్పందించి వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని ఉద్దానం ప్రజలు కోరుతున్నారు.

పలాసలో పని చేయని ఎన్టీఆర్ సుజల ధార పథకం →



రథసప్తమికి ఘనంగా ఏర్పాట్లు

- జిల్లా ప్రతిష్ఠను పెంచేలా వేడుకలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పండుగగా ప్రకటించిన రథసప్తమి వేడుకలను జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో మూడు రోజుల పాటు వేడుకలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా శోభాయాత్ర, సంప్రదాయ క్రీడలు, లేజర్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. లక్షలాది భక్తులను ఆకర్షించే విధంగా శ్రీకాకుళం నగరాన్ని ముస్తాబు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రధాన కూడళ్లలో సుందరీకరణ కార్యక్రమాలు చేపట్టాలని, ఫౌంటెయిన్లు నిర్మించాలని సూచించారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఈ వేడుకలు విజయవంతంగా నిర్వహించడానికి అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, డీఎస్పీ వివేకానంద, మున్సిపల్ కమిషనర్లు ప్రసాదరావు, అరసవల్లి ఆలయ ఈవో వై.భద్రాజీ, డీఎస్‌డీఓ శ్రీధర్, పర్యాటకాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఐదేళ్ల తరువాత..

(మూడో పేజీ తరువాయి)

విద్యలోనే చిన్నారులకు మాతృభాషను దూరం చేసింది. కేవలం ఆంగ్లంలో మాత్రమే పుస్తకాలు ఉండేవి. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. చిన్నారుల్లో సృజనాత్మకత వెలికితీసేలా కొత్త పుస్తకాలను పంపిణీ చేసింది. ఆంగ్లంతో పాటు తెలుగు భాష గొప్పదనాన్ని చిన్నారులకు అందించాలనే లక్ష్యంతో తెలుగు అభ్యాస దీపిక అందించేందుకు శ్రీకారం చుట్టింది. దీనివల్ల చిన్నారుల్లో మరింత విజ్ఞానం పెంపొందించేందుకు అవకాశం ఏర్పడింది.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం తగదు

- డీఎస్పీ వివేకానంద
- 'మీకోసం'లో 38 వినతులు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం తగదని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక 'మీ కోసం' కార్యక్రమంలో ఆయన వినతులు స్వీకరించారు. మొత్తం 38 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా డీఎస్పీ వివేకానంద అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి... వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో డీఎస్పీ మాట్లాడుతూ.. చట్ట ప్రకారం పూర్తి స్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు న్యాయం చేసేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద



సిక్కోలుతో సీఎస్‌కు అనుబంధం

- రెండు దశాబ్దాల కిందట కలెక్టర్‌గా విజయానంద్

శ్రీకాకుళం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా కె.విజయానంద్ నియమితులైన విషయం తెలిసిందే. ఆయన ఒకప్పుడు శ్రీకాకుళం కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. రెండు దశాబాల కిందట.. అంటే 2002 నుంచి 2004 మధ్య కాలంలో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం కలెక్టర్‌గా విజయానంద్ వ్యవహరించారు. ఆ సమయంలో జిల్లా ప్రగతికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు నిధులు రప్పించడంలో ప్రజాప్రతినిధులతో మాట్లాడి చురుగ్గా వ్యవహరించారన్న పేరు ఉంది. విజయానంద్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో జాతీయ రహదారిని ఆనుకుని 'విజయాదిత్య పార్క్' రూపుదిద్దుకుంది. అలాగే అప్పటి ప్రజాప్రతినిధులు.. ప్రస్తుత మంత్రులు.. కీలక స్థానాల్లో ఉన్నవారి వద్ద సౌమ్యులుగా మంచి పేరు సంపాదించారు. విజయానంద్‌ను సీఎస్‌గా నియమించారన్న వార్త ప్రచార మాధ్యమాల్లో తెలియగానే.. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని కూటమి ప్రభుత్వం సీఎస్‌గా అవకాశం కల్పించి ప్రాధాన్యం ఇవ్వడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి శ్రీకాకుళం జిల్లాను మరింత అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేందుకు అవసరమైన సాయం అందిస్తారని ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యానికి తావు లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 94 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులతో షెడ్యూల్ కులాల సాధికారిత సాధనకు ఎచ్చెర్ల నియోజకవర్గంలో బీఆర్ అంబేడ్కర్ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పౌరహక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టంపై జిల్లా స్థాయి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అట్రాసిటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు.రమణమూర్తి మాట్లాడుతూ ఎస్సీ మాకివలసలో భూములు లేని పేద ఎస్సీ రైతులకు భూములు అందించి ఆదుకో వాలని కోరారు.ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎస్సీల భూఆక్ర మణలపై విచారణ జరిపి, కబ్జాలు, దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వ రరావు కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, డీఆర్వో వేంకటేశ్వరరావు, శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

కలెక్టర్ కార్యాలయంలో గల ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్స్ భద్రపరిచే గోడౌన్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిసీళ్లను, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. డీఆర్వో వేంకటేశ్వరరావు, టీడీపీ నుంచి కొమ్మనా పల్లివె ంకట రామరాజు, కాంగ్రెస్ నుంచి కేవీఎల్ఎస్.ఈశ్వరి, సీపీఎం తరఫున మాతల గోవర్ధనరావు, బీఎస్పీ తరఫున లాసా సోమేశ్వరరావు, వైసీపీ నుండి రౌతు శంకరరావు, సీ-సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

● మాన్యువల్ స్కావెంజర్స్ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, ఆ వ్యవస్థకు స్వస్తి పలకాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ వ్యవస్థ నిర్మూలనపై మునిసిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్‌రెడ్డి, డీపీవో భారతి సౌజన్య శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా సోమవారం ఎన్నికల అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తుది జాబితా విడుదలచేశారు. ఆరు జిల్లాల పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 12,948 మంది పురుషులు కాగా 8,607 మంది మహిళలు. అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది, విజయనగరం జిల్లాలో 4,937, శ్రీకాకుళం జిల్లాలో 4,829, అనకాపల్లి జిల్లాలో 2,802, పార్వతీపురం మన్యంలో 2,262 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 19,587. ఈ పర్యాయం స్వల్పంగా పెరిగారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గత నెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. ఆ ప్రక్రియ ముగియడంతో సోమవారం ఎన్నికల అధికారి తుది జాబితా విడుదల చేశారు. గత నెల 23న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 15,297 మంది ఓటర్లు ఉండగా అభ్యంతరాలు స్వీకరించడంతోపాటు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా 19 మంది ఓటర్లపై అభ్యంతరాలు రాగా వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. కొత్తగా పురుషులు 3,325, మహిళలు 2,962 మంది వెరసి 6,287 మంది దరఖాస్తు చేయగా పరిశీలించి అందరినీ ఓటర్ల జాబితాలో చేర్చారు. ఇదిలావుండగా వచ్చే ఏడాది ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తర్వాత మరోసారి ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇవ్వనున్నది.

నూతన విధానాలు అవలంబించాలి


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, రైతులు నూతన ఆక్వాకల్చర్ విధానాలను అవగాహన చేసుకొని..వాటిని అవలంబించేలా చర్యలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మత్స్యశాస్త్రం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్.బాలకృష్ణ, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే గొండు శంకర్


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవిల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పాతిమా బేగం కుటుంబ సభ్యులను అన్నివిధాలా ఆదుకుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రజాక్ కుటుంబ సభ్యులు అందజేసిన రూ.10వేల నగదును ఆయన విశాఖ-ఎ కాలనీలో గల తన కార్యాలయంలో బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రజాక్ కుటుంబ సభ్యులు, ఎండి.రఫీ, టీడీపీ మైనారిటీ నాయకులు షేక్ నిజాముద్దీన్, బహదూర్ బాషా, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


బల్లిపుట్టుగలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అశోక్

కవిటి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కవిటి మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల కాలంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను సోమవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బి.అశోక్ పరామర్శించారు. కమలాయిపుట్టుగ, జాడుపూడి ఆర్ఎస్, చండిపుట్టుగ, బెలగాం, బల్లిపుట్టుగ, ముత్యాలపేట, రామయ్యపుట్టుగ, పెద్దశ్రీరాంపురం గ్రామాల్లో మృతుల కుటుంబాలను పరామర్శించి, సంతాపం తెలిపారు. ఆయన వెంట రైల్వే బోర్డు మెంబర్ రంగా రౌలో, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, మోహనరావులు ఉన్నారు.

ఆదిత్యాలయ టెండర్లు ఖరారు

అరసవిల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయానికి సంబధించి సోమవారం టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించారు. కూరగాయలు, ఆకుకూరలు, పాలు, పెరుగు, ప్యాకింగ్ కవర్లు, క్లాత్ బ్యాగ్స్ ప్రసాదాల ప్యాకింగ్, సెల్‌ఫోన్లు భద్రపరచడం, స్వామివారి ఫొటోల సరఫరా, గోవుల దాణాకు సంబంధించిన టెండర్లను ఖరారు చేశారు. అలాగే పూలు, పూలదండలు, స్టేషనరీ, కంప్యూటర్, ఎలక్ట్రికల్ సామగ్రి సరఫరాకు సంబంధించిన టెండర్లను వాయిదా వేశారు. పూలు, పూలదండలు సప్లై కోసం నిర్వహించిన టెండర్స్‌కు షెడ్యూల్ రాని కారణంగా పాటను వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వై.భద్రాజీ, శ్రీకూర్మం దేవస్థానం ఈవో గురునాథం, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కనకరాజు, టీడీపీ నాయకుడు ఉంగటి వెంకటరమణ, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఐ పైడపునాయుడికి అవార్డు


అవార్డు అందుకుంటున్న సీఐ పైడపునాయుడు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖలో ఆరు విభాగాల్లో ఆరుగురు పోలీసు అధికారులకు ఉత్తమ ప్రతిభా పురస్కార అవార్డులు వరించాయి. ఈ మేరకు విశాఖపట్నంలో సీఐడీ విభాగంలో సీఐగా పని చేసిన కె.పైడపునాయుడుకి వార్షిక రోలింగ్ అవార్డు-2024 వరించింది. ఈ అవార్డును జయవాడలోని డీజీపీ కార్యాలయంలో సోమవారం సీఐడీ అదనపు డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్, ఐజీ వినీత్ బ్రిజలాల్ ద్వారా అందుకున్నారు. పైడపునాయుడు ప్రస్తుతం శ్రీకాకుళం సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, డీఎస్పీ సిహెచ్.వివేకానంద, తదితరులు అభినందించారు

పరిశ్రమల స్థాపనపై అవగాహన అవసరం

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనపై అవగాహన అవసరమని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పి.వి.రంగనాథ్ అన్నారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆర్ఏఎంపీ కింద రాష్ట్రంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లను నిర్వహిం చనుందని తెలిపారు. జిల్లాలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పలాసలో త్వరలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు ముందుగా జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కార్యాలయంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

ప్రజా వినతులకు భారీ స్పందన

పర్లాకిమిడి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గజపతి జిల్లా గుసాని సమితి రొంప గ్రామ పంచాయతీ కార్యాలయంలో కలెక్టర్ విజయ్ కుమార్ దాస్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజల నుంచి 95 వినతులు స్వీకరించారు. వాటిలో 75 వ్యక్తిగత, 20 గ్రామాధికారిత ఉన్నాయి. వీటిలో 7 వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి గుణనిధి నాయక్, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ మహ్మద్ అలీ, సమితి అధ్యక్షులు వీరరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

●వామపక్ష నాయకుల డిమాండ్


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

అరసవల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఎంఎల్ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు మాట్లాడారు. దేశానికి మతోన్మాదం ప్రమాదకరమని ఆందోళనవ్యక్తంచేశారు. ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు యుగంధర్, కె.శ్రీనివాస్, చిక్కాల .గోవిందరావు, ప్రభావతి, కొత్తకోట.అప్పారావు, అల్లు.సత్యం, కె.సూరయ్య, ఆర్.ప్రకాష్, ఎడ్ల.గోపి, నీలంరాజు, కృష్ణవేణి, లలిత, ఎన్వీ రమణ, ఎల్.మహేష్ పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన


గుజరాతీపేట: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

గుజరాతీపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం పోలీసు స్టేషన్‌లో న్యాయవాది వీవీ శేషాద్రిని సివిల్ కేసులో విచారణ పేరుతో పిలిచి అసభ్య పదజాలంతో మానసిక క్షోభకు గురిచేసి... మృతిచెందడానికి కారణమైన పోలీసుల తీరును జిల్లా బార్ అసోసియేషన్ ఖండించింది. ఈ మేరకు సోమవారం న్యాయవాదులు నల్లబ్యాడ్జిలతో శ్రీకాకుళంలో ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి ప్రసన్నకుమార్, ఎన్ని సూర్యారావు, ఆగూరు ఉమామహేశ్వరరావు, కె.సుభాష్, ఎస్.హరి, పి.దామోదర తదితరులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు అనంతపురంలో మృతి చెందిన న్యాయవాది బీవీ శేషాద్రిపై పోలీసులు ప్రవర్తించిన తీరుకు నిరసనగా సోమవారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మీబాయి ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు సాధు ధనుంజయరావు, తమ్మినేని అన్నమనాయుడు, బొడ్డేపల్లి మోహన్‌రావు, గురుగుబిల్లి ప్రభాకరరావు, వాడవలస రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవాలి

సోంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో అండగా నిలవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, మడ్డు బుద్దేశు, జుత్తు పురుషోత్తం, మడ్డు రవి కోరారు.ఈ మేరకు తహసీల్దార్ అప్పలస్వామికి సోమవారం వినతి పత్రం సమర్పించారు. వర్షాలకు పాడైన పంటను నమోదుచేయాలని కోరారు.

స్కేటింగ్ పోటీలకు సోంపేట బాలల ఎంపిక

సోంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 28,29 తేదీల్లో జరిగిన రెండో ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్ పోటీల్లో సోంపేటకు చెందిన తెలుకల అన్విక బంగారు పథకం, తెలుకల అన్విక రజిత పథకం సాధించారు. అలాగే బాలుర విభాగంలో విష్ణువర్ధన్, సుమన్ తమిళనాడులోని మధురైలో జరగనున్న 24వ జాతీయ పోటీలకు అర్హత సాధించినట్లు కోచ్ బి.చంద్రవతి, గోపాల్ కృష్ణ తెలిపారు.

రాహుల్‌కు వడ్డాది పాపయ్య స్మారక పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్రకళాకారుడు రాహుల్ పట్నాయక్‌కు వడ్డాది పాపయ్య (వపా) స్మారక పురస్కారం లభించింది. విశాఖలోని చిత్రకళాపరిషత్ కంచరపాలెం బీఎస్ఆర్.భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేసి సన్మానించారు. ఒకే చట్రంలో వడ్డాది పాపయ్య గీసిన వంద చిత్రాలను సూక్ష్మీకరించి తీర్చిదిద్దారు. వపా వర్ధంతిని పురస్కరించుకొని ఆయన లోగోతో ఉన్న రజిత ఉంగరాన్ని రాహుల్‌కు బహూకరించారు.

రంగోలి పోటీల్లో బీఆర్ ఏయూ జట్టు ప్రతిభ

ఎచ్చెర్ల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ జట్టు పశ్చిమబెంగాల్‌లోని బర్దమాన్ జిల్లాలో గల రాణిగంజ్ కళాశాలలో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరంలో భాగంగా నిర్వహించిన రంగోలి పోటీలో ప్రతిభచూపింది. ఈ మేరకు జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈనెల 16 నుంచి 22 వరకు ఈ శిబిరంలో వర్సిటీకి చెందిన బి.యమున, ఎస్.కల్యాణి, కె.ఝాన్సీ, పి.దేవిక, పి.రమేష్‌తో పాటు శ్రీకాకుళానికి చెందిన ఎస్.షణ్ముఖ, ఎ.కౌశిక్, జె.లోలాక్షి బృందం ఎన్ఎస్ఎస్ యూనిట్- 2 పీవో డాక్టర్ డి.తాతారావు నేతృత్వంలో పాల్గొన్నారు. ఈ మేరకు సోమవారం జట్టు సభ్యులను వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో ..

గుజరాతీపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం బీకాం చదువుతున్న పవిత్ర జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమస్థానం సాధించింది. ఈ మేరకు అమరావతిలో మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులు బహుమతి అందుకుంది.

కవిటి మండల బడ్జెట్ ఆమోదం

కవిటి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కవిటి మండల వార్షికబడ్జెట్‌ను ఎంపీపీ కె.పద్మ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో సభ్యులు ఆమోదించారు. 2024-25లో వివిధ పద్దుల కింద ఆదాయం, ఖర్చులతో పాటు ఉద్యోగుల జీత భత్యాలు, నీటిపంపుల నిర్వహణ కింద బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈమేరకు 2025-26లో సవరించిన బడ్జెట్‌ను సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వింత వ్యాధితో కోళ్ల మృతి

రణస్థలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రణస్థలంలోని కాపువీధి, కంబాలపేట, సీతంవలస, అక్కయ్యపాలెంలో తదితర గ్రామాల్లో పెరడ కోళ్లు వింతవ్యాధితో మృతి చెందుతున్నాయి. పెరడకోళ్ల పెంపకం లాభదాయకం కావడంతో రైతులు, పెంచడానికి ఆసక్తి చూపుతున్నారు.ఈనేపథ్యంలో రోజులుగ వింతవ్యాధితో నాటు కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. పగలు కల్లాలు, బహిరంగ ప్రదేశాల్లో మేత మేసుకొని వచ్చిన కోళ్లు రాత్రి సమయంలో గూట్లో మృతి చెందుతున్నాయని కోళ్ల పెంపకం దారులు చెబుతున్నారు. కంబాలపేటలోని ఒకేసారి25 కోళ్లు వింత వ్యాధితో మృతి చెందాయని జామీన మణికంఠ తెలిపాడు.రణస్థలంలోని కాపు వీధిలో యడ్ల చిన్నకి సంబంధంచిన 40 కోళ్లు, షేక్ బాషకు సంబంధించి 20 కోళ్లు మృతి చెందాయని వాపోతున్నారు. పశువైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

శ్రీకాకుళంలో పోలీసు ఆంక్షలు: సీఐ

శ్రీకాకుళంక్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో బుధవారం రాత్రి మద్యం సేవించి న్యూఇయర్ వేడుకలు చేసుకోవద్దని ప్రజలకు రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ పి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. న్యూఇయర్ వేడుకల్లో ప్రజలు పోలీసులకు సహకరించాలని,నగరంలో అమలయ్యే పోలీసు ఆంక్షలను పాటించాలని సిఐ ఈశ్వరరావు కోరారు.

● ఇచ్ఛాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): న్యూఇయర్ వేడుకలు ఎవ్వరికీ ఇబ్బందులు లేకుండా ఇంటివద్దే జరుపుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మీసాల చిన్నమనాయుడు ఒక ప్రకటనలో కోరారు.

● సోంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను బుధవారం రాత్రి బహిరంగ వేదికల్లో నిర్వహించరాదని సీఐ మంగరాజు తెలిపారు.

గుమడాం రోడ్డు అభివృద్ధి


గ్రావెల్‌వేసి అభివృద్ధి చేస్తున్న దృశ్యం

లావేరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమడాంలో రోడ్డును అభివృద్ధి చేశారు. గుమడాం రోడ్డు బురదమయం శీర్షికతో ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం బురదమ యమైన రోడ్డుపై గ్రావెల్ వేసి అభివృద్ధి చేశారు.

2న అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఇంటర్వ్యూలు

పొందూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిలపల్లిపేటలో గల మోడల్ స్కూల్ వసతిగృహంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ ఉద్యోగానికి జనవరి రెండో తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంఈవో-1 రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం లో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని కోరారు.

బాధితులకు సాయం

పొందూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిపల్లిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని ప్రమాద బాధితులకు పొందూరు లయన్స్‌క్లబ్ అండగా నిలిచింది.ఈ మేరకు నాలుగు బాధిత కుటుంబాలకు రూ.10 వేలు, 20 కేజీల బియ్యం చొప్పున అందజేశారు.

హెవీ డ్రైవింగ్‌లో శిక్షణ

అరసవల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 19వ బ్యాచ్ శిక్షణ త్వరలో ప్రారంభం కానుండడంతో అర్హత, అనుభవం కలవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 18వ బ్యాచ్ డ్రైవర్లకు సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 రోజుల శిక్షణలో డ్రైవింగ్‌తో పాటు మెకానికల్ వర్క్, యోగా, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్, రోడ్డు ట్రాఫిక్ రూల్స్ తదితర విషయాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సమస్యలపై స్పందించండి

ఆమదాలవలస, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలని మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు కోరారు.ఈ మేరకు అమరావతిలో మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్‌ను కలిశారు.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి

లావేరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవా లని ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండలం మురపాక కేజీబీవీపాఠశాల ఆవరణలో పాఠశాల విద్యార్థినులకు ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డవలప్‌మెంట్ఆధ్వర్యంలో అయోడిన్‌లోపంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బల్ల సుధారాణి,రెడ్డి ఆనంద్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ఆదాయ కల్పనే ధ్యేయం

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు ఆదాయం కల్పనే ధ్యేయంగా మెప్మా అర్బన్ మార్కెట్లు నిర్వహిస్తున్నట్లు సీఎంఎం ఎస్.వెంకటరావు తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని రైతుబజారు సమీపంలో నిర్వహిస్తున్న మెప్మా అర్బన్ మార్కెట్‌ను పరిశీలించారు. అలాగే ఎంపీసీఆర్సీ కార్యాలయంలో సర్వీసు ప్రొవైడర్ల గుర్తింపు, ఎంపిక, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా మిషన్ కోఆర్డినేటర్ వి.విజయకుమారి పాల్గొన్నారు.

వావాంలో చెరకు తోట దగ్ధం

బూర్జ, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వావాం గ్రామంలో గొలివి సూరపునాయుడుకు చెందిన సుమారు ఎకరా 20 సెంట్లు చెరకుతోట సోమవారం జరిగిన అగ్ని ప్రమా దంలో దగ్ధమయ్యింది. సమాచారం అందుకున్న పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు హుటాహుటిన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని సర్వేశ్వరరావు తెలిపారు.

వివిధ కేసుల్లో ముగ్గురి అరెస్టు

కంచిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సారా తరలించడంతో పాటు అక్రమ మద్యం కలిగి ఉన్న కేసుల్లో సోమవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ పారినాయుడు తెలిపారు. మండలంలోని నువాగడ కాలనీకి చెందిన లందర్ గొమాంగో అనే వ్యక్తి ఒక గోనె సంచెలో 8 లీటర్ల నాటు సారా తరలిస్తుండగా పట్టుకొని అరెస్ట్ చేశామని చెప్పారు. మాణిక్యపురం గ్రామానికి చెందిన డిల్లమ్మ 8 లీటర్ల సారా ప్యాకెట్లను తరలిస్తుండగా, ఆమెను పట్టుకొని అరెస్ట్ చేశామని తెలిపారు. జె. నారాయణపురంలో ఎం.తార అనే మహిళ అక్రమంగా 19 మద్యం సీసాలు కలిగి ఉండటతో ఆమెను కూడా అరెస్ట్ చేశామని చెప్పారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సంఘాల బలోపేతానికి కృషిచేయాలని ఏపీఎం సనపల ప్రసాద్ కోరారు. సోమవారం ఇచ్ఛాపురంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామసంఘాల లీడర్లు, వీవోఏలకు విజన్ బిల్డింగ్ శిక్షణకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కె.రాము పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్ము-కశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు తృతీయ స్థానం లభిం చింది. ఈ జట్టులో ఉన్న జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులను సోమవారం రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అభినందించారు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న చింతాడ జశ్వంత్, మెట్ట హర్షవర్ధన్, పూజారి కల్యాణరామ్‌లు రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలలో మనం రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఈ క్రీడాకారులను జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘ అధ్యక్షులు కలిదిండి నరసింహరాజు, కార్యదర్శి లక్ష్మీదేవి, కన్వీనర్ కె.వెంకటరామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వి.రమణ, చైర్మన్ బడగల హరిధర్‌రావు, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, బి.సురేష్ తదితరులు అభినందించారు.


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

క్రైం కార్నర్

ఒడిశా నుంచి గంజాయి రవాణా

● 11 కేజీల 430 గ్రాముల సీజ్ ● ఇద్దరి అరెస్టు

ఇచ్ఛాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న 11కేజీల 430 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలోని సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని ఘజాబాద్ జిల్లాకు చెందిన అజయ్, అజయ్ (వీరిద్దరూ ఇద్దరు పేర్లు ఒక్కటే, తండ్రి పేర్లే వేరు) ఒడిశాలోని బడగడ వద్ద గల మణిక్యాపూర్ ఏరాయి వద్దకు వచ్చి అపాలో మండల్ వద్ద కేజీ గంజాయిని రూ.మూడు వేలు చొప్పున 11కేజీల 430గ్రాముల కొనుగోలు చేశారు. ఈ గంజాయిని ఉత్తరప్రదేశ్‌లోని సోనూ అనే వ్యక్తికి కేజీ రూ.ఐదు వేలు చొప్పున అమ్మేం దుకు తీసుకువెళ్లే క్రమంలో గంజాయితో సోమవారం సాయంత్రం ఇచ్ఛాపురం చేరుకున్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఆ సమయంలో ఎం.తోటూరు రైల్వే ఎల్‌సీ గేట్ వద్ద రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది తనిఖీ చేపట్టగా అనుమానితులుగా కనిపించిన వీరిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయిని సీజ్ చేయటంతో పాటు ఇద్దరి నిందితులను అరెస్ట్ చేశారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తులపై కేసు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఓ మహిళపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళంలోని టౌన్‌హాల్ సందులోని ఓ కల్యాణ మండపంలో శుభకార్యానికి లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన లింగాల అప్పమ్మ తన చెల్లెలి కుమారుడితో ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వచ్చింది. అదే సమయంలో నగరానికి చెందిన ఎండి సల్మాన్, ఎర్రయ్య ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్నారు. వారిద్దరూ మద్యం మత్తులో కిందపడిపోయారు. తాము పడిపోవడానికి అప్పమ్మ, ఆమె చెల్లెలు కొడుకే కారణమని వారిద్దరిని చేతికి వేసుకునే కడియంతో కొట్టారు. దీంతో అప్పమ్మకు కుడి కంటి కింది భాగంలో తీవ్ర గాయం కావడంతో ఆమెను స్థానికులు ఆటోలో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అప్పమ్మ అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం దాడికి పాల్పడిన సల్మాన్, ఎర్రయ్యలపై వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ కేసు నమోదు చేశారు.

మనస్తాపానికి గురై హెల్త్ అసిస్టెంట్ మృతి


సూర్యప్రసాదరావు (ఫైల్)

అరసవల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పూజారి సూర్యప్రసాదరావు(57) ఉద్యోగం పోయిందని మనస్తాపానికి గురై సోమవారం మృతి చెందారు. హెల్త్ అసిస్టెంట్ల యూనియన్ నాయకుడు మురళి కథనం మేరకు.. హెల్త్ అసి స్టెంట్‌గా సూర్యప్రసాదరావు 22 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగం పర్మినెంట్ కాకపోయినా, ప్రతి నెలా వచ్చే కొద్దిపాటి జీతంతోనే తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 1200 మంది హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగంలో నుంచి తొలగించగా సూర్యప్రసాదరావు కూడా ఉద్యోగం కోల్పోయాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఇన్నేళ్ల సర్వీసు తర్వాత ఉద్యోగంలో నుంచి తీసేస్తే తన కుటుంబాన్ని ఎలా పోషిస్తాను అనే మనోవ్యథతో బాధపడుతూ మెదడులో నరాలు చిట్లిపోయి, బ్రెయిన్ హెమరేజ్‌కు గురయ్యాడు. సోమవారం ఓ ఆసుపత్రిలో చేర్పించగా ఆయన మృతిచెందాడు. కాగా సూర్యప్రసాదరావు కుటుంబాన్ని ఆదుకోవాలని యూనియన్ నాయకులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిప త్రం అందజేశారు.

విద్యుత్ వైరు తగిలి వ్యక్తి మృతి


రామారావు (ఫైల్)

సోంపేట/కంచిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కంచిలి జాతీయరహదారి సమీపంలోని పందుల కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ వైరు తగిలి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కంచిలి మండలంలోని బాసు బంజిరి గ్రామానికి చెందిన బొండాడ రామారావు(45) తాను పెంచు తున్న మేకల ఆహారం కోసం సోంపేట మండలంలోని బిరువాడ సమీపంలో హైవే వద్ద ఉన్న పొలంలోకి సోమవారం వెళ్లాడు. అక్కడ కొందరు పందుల బెడద నుంచి తప్పించుకోనేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. రామారావుకు చరణ్, నహీన్ పిల్లలున్నారు. ఈ మేరకు బారువ ఎస్ఐ హరిబాబు కేసు నమోదుచేశారు.

పుట్టినరోజు వేడుకల్లో వివాదం

కొత్తూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పారాపురం గ్రామంలో ఆదివారం ఓ పుట్టిన రోజు వేడుకల్లో వివాదం జరిగింది. ఈ నేపథ్యం లో మరలా సోమవారం వాగ్వాదం జరిగి ఒక యువకుడు దాడికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పైల శ్రీను పుట్టిన రోజు వేడుక సమయంలో కేక్ కట్ చేస్తుండగా జీవన్‌కుమార్ ఫోం స్ప్రే కొట్టాడు. దీంతో దుక్క సాయి కుమార్ అతడిని వారించగా వివాదం జరిగి సద్దుమణిగింది. సోమ వారం మధ్యాహ్నం పారాపురం సచివాలయం వద్ద మళ్లీ వాగ్వాదం జరగ్గా జంప జీవన్ కుమార్ సాయికుమార్‌పై కీచైన్‌తో దాడిచేశాడు. ఈ నేపథ్యంలో గాయ పడిన సాయి కుమార్ కొత్తూరు సామాజిక ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు జీవన్ కుమార్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

హరిపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మందస మండలం రంగోయి గేటు-మఖరజోల మధ్య ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సువర్ణాపురం గ్రామానికి చెందిన ఎ.పోతయ్య ఆదివారం రాత్రి బస్సు దిగి రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయనకు ఒక చేయి, ఒక కాలుగు విరిగి నుజ్జునుజ్జయింది. పలాస ఆసుపత్రిలో చికిత్స పొందగా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు


వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

పలాస, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎన్. రామారావు అన్నారు. సోమవారం కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిం చారు. పింఛన్ల నిమిత్తం 4, మంచినీటి సరఫరాకు 4, పారిశుధ్య సమస్యలపై 8 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిని ఆయా విభాగాలకు పంపిం చామన్నారు. పారిశుధ్యం, మంచినీటిపై వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని ఆయా విభా గాల అధికారులకు ఆదేశించారు.

ఉపాధ్యాయినిపై ఎంఈవోకి ఫిర్యాదు

నందిగాం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మొండ్రాయివలస పంచాయతీ సుబ్బమ్మపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని సోమవారం హాజరు కాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోకి ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. సోమవారం ఎంఆర్‌సీకి విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి ఎంఈవో-1 జి.నర్సింహులు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. దీంతో ఎంఈవో స్పందించి సీఆర్పీ తిరుపతిరావును పాఠశాలకు పంపారు. ఎంఈవో మాట్లాడుతూ ఈ ఏడాది చివరి కావడంతో ఉన్న సెలవులను ఆమె వినియోగించుకోవడం వల్లే హాజరు కాలేదని ఆయన తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

కొత్తూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడే వారిపై కఠిన చర్యలు తప్పవని కొత్తూరు ఎస్ఐ ఎండీ అమీర్‌ఆలీ తెలిపారు. మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకుని, రూ. 1280 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఫ్లైఓవర్ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలివ్వండి

పలాస, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఎల్‌సీ గేటు ఫ్లైఓవర్ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశించారు. సోమవారం సూదికొండ కాలనీలో ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి నిర్వాసితుడికి ఇంటి స్థలం మంజూరు చేయాలని, బ్రిడ్జి నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇప్పటికే ఇవ్వడం జరిగిందని, ఇంకా పెండింగ్‌లో ఉన్న వారికి త్వరలో పరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణం ఆలస్యమైందని, పట్టాలిచ్చిన తరువాత ఆ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంత స్థలాన్ని కేటాయించారు, నిర్వాసి తులెంతమంది తదితర అంశాలను తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. అనం తరం శ్మశానవాటికకు కేటాయించిన స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, టంకాల రవిశంకర్‌గుప్తా, జోగ మల్లి, ఎ.రామకృష్ణ, చంద్రశేఖర్ త్యాడి, సర్వేయర్ వి.గిరి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుం దని, విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పూండి-గోవిందపురం హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఆసక్తి ఉన్న క్రీడను ఎంచుకుని అందులో తర్ఫీదు పొంది మంచి ప్రతిభ కనబరచా లన్నారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం ప్రకటించారు. క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడాకారుల్లో స్ఫూర్తిని పెంపొందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ జి.వసంతస్వామి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, హెచ్ఎం హరిబాబు, పీఈటీ తవిటయ్య, పలువురు ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

'మీకోసం' గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా


స్పందన కార్యక్రమానికి హాజరైన పలువురు అధికారులు, సిబ్బంది

టెక్కలి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న 'మీకోసం' కార్యక్రమానికి పలువురు డివిజన్‌స్థాయి అధికారులు డుమ్మాకొడుతున్నారు. కొద్దిమంది అధికారులు హాజరవుతుండగా మరి కొన్ని విభాగాలకు సంబంధించి కిందిస్థాయి సిబ్బందిని పంపుతూ మమ అనిపిం చేస్తున్నారు. దీంతో ఆయా శాఖలకు సంబంధించిన వినతుల పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ సోమవారం మీకోసం కార్యక్రమాన్ని పరిశీలిస్తే డీఎస్పీ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, డీఎల్‌డీవో, పీఆర్ ఈఈ, ఏటీడబ్ల్యూవో, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ తదితర శాఖల అధికారులు హాజరు కాలేదు. ఇక జిల్లా కేంద్ర ఆసుపత్రి, డివిజన్ కోప రేటివ్ ఆఫీసర్, సహాయ కార్మికశాఖ కార్యాలయం విభాగాల నుంచి జూనియర్ సహాయకులు, గృహ నిర్మాణశాఖ డీఈఈ కార్యాలయం నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్, ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయం నుంచి జేఈ స్థాయి ఉద్యోగులు, అటవీశాఖ నుంచి సహాయ బీట్ సిబ్బంది హాజరయ్యారు. దీంతో సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈదిశలో చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టణంలో ఆక్రమణలు తొలగించండి

టెక్కలి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీలో ఇంచీ ఖాళీ జాగాలతో పాటు కాలువ కనిపించినా యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయని వీటిని అరికట్టాలని పలువురు ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీకోసంలో ఎన్టీఆర్ కాలనీ, నౌపడా-మెళియాపుట్టి, తెంబూరు రోడ్డు, పాతజాతీయరహదారి, జగతిమెట్ట కాలనీ ప్రాంతా ల్లో ఆక్రమణలు జరుగుతున్నాయని జిల్లా స్వచ్ఛభారత్ కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ చేపట్టాలని ఆదీఆంధ్రా వీధికి చెందిన పినిమింటి ఎర్రయ్య, రాజశేఖర్ తదితరులు వినతి పత్రం అందజేశారు. సంత బొమ్మాళి మండలం మేఘవరంలో ప్రభుత్వ స్థలాల్లో సీసీ రోడ్లు వేసేందుకు అభ్యంతరాలు తొలగించాలని డి.శంకరరావు, కోటబొమ్మాళి మండలం భగీరథపురానికి చెందిన మెట్ట లలితకుమారి బాల సంరక్షణా పథకం రెండేళ్ల కిందట మంజూరైందని, అయితే బాండ్లు ఇప్పటి వరకు ఇవ్వలేదని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అపార్ సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు జన్ని పరమేశ్వరరావు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు.

సీఎస్‌గా విజయానంద్ నియామకంపై ఎంజీఆర్ హర్షం

పాతపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె.విజయానంద్ నియామకంపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హర్షంవ్యక్తం చేశారు. రాష్ట్రంలో తొలిసారి బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని సీఎస్‌గా నియమించడంపై సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. విజయానంద్ గతంలో కలెక్టర్‌గా శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధిపథంలో నడిపి జిల్లాతో ప్రత్యేకానుబంధం కలిగి ఉన్నారని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంతికి పనులు పూర్తి చేయాలి: బగ్గు


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న సీసీ, బీటీ రోడ్డు పనులను సంక్రాంతికి ముందే పూర్తి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఇంకా ప్రారంభించని పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఈ సత్యంనాయుడు, ఏఈలు మోహన్, బగ్గు నర్సింగరావు, కె.శ్రీధరరావు తదితరులు పాల్గొన్నారు. ● బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న నరసన్నపేట పప్పుల వీధికి చెందిన వసంతకుమారికి రూ.87 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే రమణమూర్తి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కింజరాపు చిన్నవాడు, బలగ ప్రహర్ష తదితరులు పాల్గొన్నారు.

కులగణన లోపాలను సవరించాలి

పాతపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణన జాబితాలో లోపాలను సవరించాలని మాల మహానాడు మండల శాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ప్రతి గ్రామంలో జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని వాటిని సరిచేసి తుది జాబితాలను గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలని కోరారు.

జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలో ఉపాధ్యాయుడి ప్రతిభ

పాతపట్నం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌శాఖ, శిశువైద్య బృందం సంయుక్తంగా నిర్వహించిన 'మహాసంకల్పం' ఆర్ట్ ఎగ్జిబిషన్ పోటీలో స్థానిక ఏపీ మోడల్ స్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బల్లెడ అప్పలరాజు ద్వితీయ స్థానం పొందారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి అభినందించారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ వేసిన చిత్రలేఖనానికి ద్వితీయస్థానం లభించింది.


బహుమతి అందుకుంటున్న అప్పలరాజు

ఎంపీడీవోను బెదిరించిన ఎంపీపీ

● పోలీసులకు జడ్పీ సీఈవో ఫిర్యాదు
● ఎచ్చెర్ల స్టేషన్‌లో కేసు నమోదు

శ్రీకాకుళం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఎంపీడీవోపై దాడి ఘటన మరువక ముందే.. శ్రీకాకుళం జిల్లాలో అదేరీతిలో గతంలో వైసీపీలో ఉన్న ఓ ఎంపీపీ అధికారిని బెదిరించారు. ఈ మేరకు ఉన్నత స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హుటాహుటిన స్పందించారు. దీంతో ఆయనపై కేసు నమోదుచేశారు. ఎచ్చెర్ల మండల పరిషత్ అధ్యక్షుడు మొదలవలస చిరంజీవి తొలి నుంచీ దుందుడుకు స్వభావంతో వ్యవహరి స్తున్నారు. కొద్ది రోజుల కిందట ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి మంజూరైన నిధులు.. ఇతర అభివృద్ధి పనులు.. ఉపాధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సమీక్షలో నియోజకవర్గ ఎంపీడీవోలను ఆదేశించారు. అయితే ఈ విషయమై ఎచ్చెర్ల ఎంపీపీ హోదాలో చిరంజీవి ఎంపీడీవో సీపాన హరి హరరావును తనవద్దకు పిలిపించుకుని బూతులతో బెదిరిస్తూ.. తీవ్రంగా హెచ్చరించారు. ఎమ్మెల్యే పంపిన లేఖలకు మంజూరైన పనులకు గాను ప్రతిపాదనలు పంపొద్దని.. పంపితే తీవ్ర పరిణామాలను చూడాల్సివస్తుందని హెచ్చరించడంతో పాటు చెప్పుతీసి కొడతానని ఎంపీడీవోను బెదిరించారు. ఈ పరిణామంతో ఆయన భయాందోళనకు గురై ఎచ్చెర్ల ఆసుపత్రిలో చేరారు. ఈ విషయం ఇటు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరంఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలుసుకుని ఎంపీడీవోకు భరోసా ఇచ్చి.. ఎటువంటి బెదిరింపులకు గురికాకుండా స్వేచ్ఛగా పనిచేయాలని ధైర్యం కల్పించారు. అప్పటికే విషయం కలెక్టర్‌కు చేరడంతో విచారణకు ఆదేశిం చారు. జడ్పీ సీఈవో శ్రీధర్‌బాబు.. విషయం సేకరించి.. ఎంపీడీవో నుంచి వివరాలు తీసుకుని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఎంపీడీవోను బెదిరించిన ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవిపై కలెక్టర్ ఆదేశాలతో జడ్పీ సీఈవో ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఎంపీపీపై బీఎన్ఎస్ 132, 351(2) కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్‌కుమార్ స్పష్టం చేశారు.

అప్పుడూ.. ఇప్పుడూ

ఎంపీపీ మొదలవలస చిరంజీవి న్యాయవాది. అయితే వైసీపీలో చేరి ఎంపీపీగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2022లో శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ వైశ్య యువకుడిని కిడ్నాప్ చేసి.. ఖాళీ స్టాంపు పత్రాలపై సంత కాలు చేయించుకుని.. ఆయన్ను చితకబాది విడిచిపెట్టారన్న ఆరోపణలున్నాయి. ఆ ఘటన బయటకు రావడంతో శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మిన్న కుండిపోయారు. పోలీసులు కూడా పెద్దగా పట్టించు కోకుండా అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడంతో మమ అనిపించేశారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వైసీపీకి చెందిన ద్వితీయ స్థాయి నాయకుడిపై హత్యాయత్నం చేయడంతో ఎంపీపీపై కేసు నమోదైంది. ఆ తరువాత ఆయనను వైసీపీ నుంచి తప్పించారు. అప్పుడూ.. ఇప్పుడూ రౌడీయిజం ప్రదర్శిస్తుండడంతో ప్రజలు విస్తుపోతున్నారు.

ముగిసిన హ్యాకథాన్ పోటీలు


విజేతగా నిలిచిన కోయంబత్తూరు శ్రీ ఈశ్వర్ కాలేజ్ విద్యార్థులకు బహుమతి అందిస్తున్న దృశ్యం

టెక్కలి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల (ఐతమ్)లో మూడు రోజులుగా జరుగుతున్న 'ఆవిష్కార్ సీజన్-2' హ్యాకథాన్ పోటీలు సోమవారంతో ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 51 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 186 మంది విద్యార్థులు పాల్గొని వివిధ సమస్యలకు పరిష్కారం చూపారు. వీటిలో ఆక్వా నీటి యంత్రం ద్వారా అందులో నీటిని సేకరించే ఐడియాతో వచ్చిన కోయంబత్తూరుకు చెందిన శ్రీ ఈశ్వర్ కాలేజ్ బృందానికి మొదటి బహుమతి లభించింది. ఈ బృందానికి రూ.1.25లక్షల నగదు ప్రశంసా పత్రాలను అందించారు. అలాగే మహరాజా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విజయనగరం, ముంబై ఏసీ పటేల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలకు వరుసగా రెండు, మూడు బహుమతులు సాధించారు. ఆదిత్య, ఎస్‌వీ ఎన్ఐటీ సూరత్ కళాశాలలు కన్సోలేషన్ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా స్టార్టప్ మెంటార్ మనోజ్ కుమార్ బడగర్ వాలా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరిగిన ఈ హ్యాకథాన్ పోటీల్లో యువ ఇంజనీర్లు పాల్గొనడమే పెద్ద విజయమ న్నారు. స్టార్టప్ రంగంలో ప్రవేశించాలనుకునే వారికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. న్యాయనిర్ణేతలుగా క్వాలీవాన్ టెక్నాలజీస్ సీఈవో బత్తుల సందీప్, సీనియర్ ఎనలిస్ట్ సుష్మ బడగర్ వాలా, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ ఎంవీ కుమార్, సురేష్‌కుమార్, గిరీష్‌కుమార్, సాయిశ్రీ తదితరులు వ్యవహరించారు.

అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు దారుణం

కాశీబుగ్గ/టెక్కలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉంటూ పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దారుణమని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కాశీబుగ్గ, టెక్కలిలో నిరసన చేపట్టారు. వివిధ పక్షాల నేతలు సన్యాసిరావు, వేణు గోపాల్, గణపతి, వీరాస్వామి, కేఎన్‌పీఎస్ నాయకులు బెలమర ప్రభాకర్, నంబూరు షణ్ముఖరావు మాట్లాడుతూ.. పార్లమెంట్ వేదికగా అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తక్షణం వెనక్కి తీసుకోవాలని, ఆయనను బర్తరఫ్ చేయాలన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు, వామపక్షాల నేతలు పాలవలస ధర్మారావు, బగాది వాసుదేవరావు జగన్ తదితరులు పాల్గొన్నారు.





కాశీబుగ్గ, టెక్కలిలో నిరసన చేపడుతున్న వామపక్ష నాయకులు

స్థల వివాదంపై డీఈవోకు పూర్తి నివేదిక

జలుమూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల హెచ్ఎంకు జరుగుతున్న స్థల వివాదంపై పూర్తి స్థాయి నివేదికను డీఈవోకి నివేదిస్తానని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి అన్నారు. హెచ్ఎం ఇప్పిలి వేణుగోపాలరావును, ప్రిన్సిపాల్ జె.సారికను ఈ అంశంపై సోమవారం విచారించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్ఎం, ప్రిన్సిపాల్‌ను విచారించి వివాదంపై దర్యాప్తుచేపట్టామని, పూర్తి స్థాయి నివేదికను డీఈవోకు అందిస్తామని ఆమె పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

గూడెం వీవోఏపై విచారణ

టెక్కలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గూడెం గ్రామంలోని పలు ఎస్‌హెచ్‌జీలకు సంబంధించిన సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా ఫేక్ రసీదులిచ్చిన అదే గ్రామానికి చెందిన వీవోఏ సార గంగయ్యపై సోమవారం వెలుగు ఏపీ ఎస్.శ్రీరాములు, ఏపీఎం ఉమారాణి విచారణ చేపట్టారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'గూడెం వీవోఏ చేతివాటం' శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించి గ్రామంలో విచారించారు. వివేకానంద, గాంధీజీ స్వయంశక్తి సంఘాలకు సంబంధించి రూ. 36,800 నగదు యూనియన్ బ్యాంక్‌కు జమ చేయాలని వీవోఏ గంగయ్యకు ఇవ్వగా ఆయన ఫేక్ రసీదులు ఆ సంఘాలకు ఇచ్చారని గుర్తించినట్లు ఏపీ తెలిపారు. అయితే ఈ విషయం బయటకు పొక్కడంతో సదరు వీవోఏ గంగయ్య ఇటీవల ఆ రెండు సంఘాలకు సంబంధించిన నగదును వడ్డీతో కలిపి బ్యాంకులో జమ చేసినట్లు గుర్తించా మన్నారు. గంగయ్య ఫేక్ రసీదులిచ్చి అక్రమాలకు పాల్పడిన నేపథ్యంలో వీవోఏగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని శ్రీరాములు తెలిపారు.

ఆక్రమణలను తొలగించాలి

నందిగాం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పెంటూరులో శ్మశాన, పాఠశాల ఆవరణల్లోని ఆక్రమణలను తొలగించాలని పలువురు గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ పి.సోమేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో బెండి గిరిబాబు, ఎస్.సూర్యారావు, జె.నారాయణరావు, కె.ప్రసాదరావు, పి.ప్రసాదరావు తదితరులు ఫిర్యాదు చేశారు.

పారిశ్రామిక శిక్షణ శుభపరిణామం

నరసన్నపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కళాశాల స్థాయి విద్యార్థులకు పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ అందించడం శుభపరిణామమని ఎంపీడీవో బి.మధుసూదనరావు అన్నారు. సోమవారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్‌లో భాగంగా వారం రోజుల పాటు ఇచ్చిన శిక్షణ సోమవారంతో ముగిసింది. స్టార్టప్ రంగంలో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో కె.నాగమణి, వ్యవసాయాధికారి సునీత, కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు, రాము, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 110 మంది విద్యార్థినీ విద్యార్థులకు స్థానికుడు వి.చంద్రశేఖరరాజు సోమవారం గ్లాసులు, ప్లేట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం బుధవారం నుంచి కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో వీటిని అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.రామారావు, ఎంఈవో-2 కె.చంద్రమౌళి, రాష్ట్ర దివ్యాంగుల ఉద్యోగసంఘ కార్యవర్గ సభ్యుడు మన్మథ కుమార్‌మిశ్రో, ఉప సర్పంచ్ అశోక్ పాణిగ్రాహి పాల్గొన్నారు.

న్యూఇయర్ వేడుకల్లో నిబంధనలు పాటించాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి నిబంధనల మేరకు నిర్వహించుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వై.సత్యనారాయణ అన్నారు. నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అర్ధరాత్రి తాగిన మైకంలో ఎవరికీ ఇబ్బందులు కలిగించవద్దని, ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలన్నారు. వేడుకలు ముగిసేంతవరకు డ్రంకెన్ డ్రైవ్ చేపడతామని, అందులో పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

80శాతం సబ్సిడీపై డ్రోన్‌లు

టెక్కలి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు గాను రైతుల కు వ్యవసాయశాఖ ద్వారా 80శాతం సబ్సిడీపై పురుగుమందుల పిచికారీకి డ్రోన్లు సరఫరా చేస్తున్నట్లు ఏడీఏ బీవీ తిరుమలరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విలేకరులతో మాట్లాడుతూ ఒక్కో డ్రోన్ ఖరీదు సుమారు రూ.6 లక్షలు కాగా రైతు రూ.1.20లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రోజులో సుమారు 15 ఎకరాలు పిచికారీకి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు డ్రోన్ల కోసం వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

సీసీడబ్ల్యూఎస్ డైరెక్టర్‌గా బొడ్డపాడు వాసి

పలాసరూరల్,డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అండమాన్ నికోబార్ దీవుల్లో సీసీడబ్ల్యూఎస్ శాఖ (సెంట్రల్ కోఆపరేటివ్ వెల్ఫేర్ సొసైటీ) ఎన్నికల్లో డైరెక్టర్‌గా పలాస మండలం బొడ్డపాడుకు చెందిన తామాడ లోహిత్ గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయనను తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, అండమాన్ శ్రీజగదీశ్వర సంఘ ప్రతినిధులు, గ్రామస్థులు అభినందించారు.

అవయవ దాత కుటుంబానికి శిరీష పరామర్శ

మందస, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మందస గ్రామ సెగిడి వీధికి చెందిన జోగారావు ఇటీవల వాహన ప్రమాదంలో మృతి చెందగా ఆయన అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. టీడీపీ నాయకులు రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య కుమార్, కృష్ణారావు, రాజాన మహేష్ తదితరులు పాల్గొన్నారు.